వ్యర్థజీవితం

ప్రాతికేళ్ళ కిందట మార్కండేయులూ నేను కలిసి చదువుకున్నాం. అప్పటి నుంచీ వాణ్ణి నేను బాగా ఎరుగుదును. వాడికి తెలివితేటలున్నై, మంచితనం ఉన్నది. అన్నీ ఉన్నై, కాని బాగుపడేవాడికి ఉండవలిసిందేదోలేదు. చిన్నతనంలో వాడికి పెద్దవాళ్ళూ, ఉపాధ్యాయులూ, సహాధ్యాయులూ కూడా ఒక్కే ఒక సలహా ఇచ్చేవారు: "నీ గొడవ నువ్వు చూసుకోలేవుట్రా?" అని. అది మాత్రం వాడికి ఆనాటికీ, ఈనాటికీ అబ్బలేదు.

మార్కండేయులు ప్రతివాళ్ళ వ్యవహారాలలోనూ చీటికీ మాటికీ జోక్యం కలిగించుకునే వాడనుకోకండి. ఇంకొకరి విషయాలు నిజంగా వాడికక్కర్లేదు. ఎవరికన్నా అన్యాయం జరిగిందని వాడికి తోచినప్పుడే తన తల రోకట్లో దూర్చే వాడు- రోకటిపోట్లు తినేవాడు.

మేమిద్దరమూ మావూరి హైస్కూల్లో సెకండుఫారం చదివేటప్పుడు మా హెడ్మాస్టరు గారి రెండో కొడుకు నాగేశ్వరం మాతో కలిసి చదివేవాడు. హెడ్మాస్టరుగారబ్బాయని చాలామంది మేస్టర్లు నాగేశ్వరానికి మార్కులు బాగావేసేవారు. తెలుగు మేస్టరు మరీ ఆప్యాయంగా వాడికి ఫస్టుమార్కే వేస్తూ ఉండేవాడు. మా క్లాసులో నిజంగా అందరికన్నా తెలివిగలవాడు శ్రీరామ్మూర్తని ఒకడుండేవాడు. (శ్రీరామ్మూర్తి ఇప్పుడు కాలేజీ లెక్చరరుగా పనిచేస్తున్నాడు.) వాడూ నాగేశ్వరమూ చాలా స్నేహంగానే ఉండేవాళ్ళు కాని అర్థ సంవత్సరపు పరీక్షల్లో తెలుగుమేస్టరు నాగేశ్వరానికి ఫస్టుమార్కులేసి తనకు తక్కువ మార్కులు వేసినందుకు శ్రీరామ్మూర్తికి కష్టం కలిగింది. శ్రీరామ్మూర్తి నాగేశ్వరం ఆన్సరు పేపరు మంచిగా అడిగితీసుకుని తన పేపరుతో పోల్చి చూసుకున్నాడు. ఎక్కడా పోలికలేదు. రెండు పేపర్లూ తీసుకొచ్చి శ్రీరామ్మూర్తి మా అందరికీ చూపించాడు. అందర్మూ చూసి ఊరుకున్నాం. కాని మార్కండేయులు మాత్రం ఆగ్రహావేశుడైనాడు.ఆ పేపర్లు రెండూ పట్టుకుపోయి హెడ్మాస్టరుకుచూపి, "చూడండి, మీ అబ్బాయని తెలుగు మేస్టారు ఎంత అన్యాయం చేశాడో!" అని ఫిర్యాదుచేశాడు.

హెడ్మాస్టరు ఆ కాగితాల కేసి చూడడానికి బదులు మార్కండేయులుకు రెండు బెత్తపు దెబ్బలతో సత్కరించి, "ఇక ఎన్నడూ నీకు సంబంధించని విషయాల్లో వేలుపెట్టకు" అని హెచ్చరించి పంపాడు.

ఇందువల్ల మార్కండేయులుకు కలిగిన మరొక లాభమేమిటంటే, శ్రీరా

మ్మూర్తి నాగేశ్వరమూ యథాప్రకారం స్నేహితులుగానే ఉంటూ ఇద్దరూ కలిసి మార్కండేయులుతో మాట్లాడటం మానేశారు.

* * *

అన్యాయమంటే మార్కండేయులు కంతపగ దేనికో నేనర్థం చేసుకోలేను. వాడికాబుద్ధి తల్లినుండో తండ్రినుండో సంక్రమించి ఉండాలి. నేను చూచినంత వరకు సాంఘిక దురన్యాయాన్ని ఏ పరిస్థితులలో చూసీ చూడనటు నటించాలో తెలిసినవాళ్ళే అంతో యింతో బాధపడుతున్నారు. సుఖపడుతున్నారు.

మార్కండేయులు బాగుపడలేదన్న దానికి వేరేరుజువు అవసరంలేదు. వాడు సుఖపడ్డాడా అన్న విషయం తెలుసుకోపటమే కష్టం; వాడిలో పశ్చాత్తాపమన్నది ఏకోశానా ఉన్నట్టు నాకు తోచదు. అందుచేత, ఒకవేళ వాడు సుఖపడకపోయినా, తాను సుఖపడటం లేదన్న బెంగ వాడికి లేదనే అనుకోవాలి.

చదువుకుంటున్నంత కాలమూ మార్కండేయులు ఉపాధ్యాయులతోనూ, లెక్చరర్లతోనూ, ప్రిన్సిపాలుంతోనూ పేచీపడుతూనే వచ్చాడు. ఒక ప్రిన్సిపాలు వాడికి ట్రాన్స్‌ఫరు సర్టిఫికెట్టు ఇచ్చి కాలేజీనుంచి పంపించేశాడు కూడానూ.

వాడి న్యాయపర్వతం వాణ్ణి ఒక విధంగా హింసించలేదు. దానిమూలంగా వాణ్ణి అందరూ అంతదూరాన వుంచటమేకాక, అవహేళనకూడా చేసేవాళ్ళు. తానేదైనా తప్పు చేసినట్టుతోస్తే వెంటనే తనవల్ల అపచారం జరిగినవాళ్ళకు క్షమాపణ చెప్పుకునేవాడు. ఇతరుల తప్పులను క్షమించలేనట్టే వాడు తన తప్పులను కూడా క్షమించలేక పొయ్యేవాడు. అందువల్ల కూడా వాడు అవహేళన పాలవుతుండేవాడు.

మార్కండేయులు ఆటే కలవాడు కాకపోవటంచేత వాడు చదువు ముగిస్తూనే ఉద్యోగంలో చేరవలిసి వచ్చింది. ఉద్యోగంలో కూడా వాడిగతి ఇంతే అయింది. ఏ ఉద్యోగంలోనూ ఎక్కువకాలం నిలవలేక పొయ్యేవాడు. వాడికి క్రమంగా న్యాయంతోబాటు హక్కుల మీద కూడా అభిమానం ఏర్పడింది. న్యాయానికీ హక్కులకూగల సంబంధం అర్థమైనాక వాడు ఇతరుల హక్కులకోసమూ, తన హక్కులకోసమూ రకరకాల మనుషులతో పేచీపడసాగాడు.

* * *

మార్కండేయులుకు పెళ్ళి అయింది. చదువు పూర్తి అయే సమయానికే పెళ్లాం కాపరానికి వచ్చింది. వాడి అత్తవారు పెద్ద భాగ్యవంతులు కారుగాని. వాడికన్న కాస్త మంచి స్థితిలోనే ఉన్నారు. వీడికి ఉద్యోగం ఊడినప్పుడల్లా వాళ్లే ఆదుకుంటూ ఉండేవాళ్లు. వాడి పినమామగారు పోలీసు సబినస్పెక్టరు కూడానూ. ఆయన వీణ్ణి సబినస్పెక్టరు సెలెక్షనుకు పొమ్మన్నాడు. వీడు పోలీసులనూ, బ్రిటిష అధికార్లనూ పడతిట్టేసి ప్రాణంపోయినా పోలీసుశాఖలో పనిచెయ్యనన్నాడు.

"మా బాబాయి పోలీసుశాఖలో ఉన్నాడు గదా, ఆయన ఎదటనే పోలీసులను తిట్టకపోతేనేం ? ఆయన ఏమనుకుంటాడు?" అన్నది వాడిభార్య.

"ఏమనుకుంటాడూ? నాకు పోలీసులంటే అసహ్యమనీ, వాళ్లను మనుషులల్లే చూడలేననీ అనుకుంటాడు" అన్నాడు మార్కండేయులు. "ఏదో సహాయంచేద్దామని ప్రయత్నించేవాణ్ణి అట్లా అవమానిస్తారండీ?"

"ఆయన్నేం అవమానించానూ? పోలీసులను మెచ్చుకోకుండా ఆయనను గౌరవించటానికి వీల్లేదా ఏం?"

"ఆయన చేసే ఉద్యోగాన్ని తిట్టి ఆయన్ను మర్యాద చేస్తారు కాబోలు. ఆ సంగతి నాకు తెలీదు." అన్నది వాడిభార్య.

"అర్థం ఉండేటట్లు మాట్లాడ్డం నీకే తెలుసునన్న భావంతో మాట్లాడకు. ఆయన నన్ను పోలీసుల్లో చేరమనకపోతే నేనాయన ఉద్యోగం ఊసే ఎత్తనేమో. పోలీసుపని నీచమని నా నమ్మకం. ఆయనకే ఆ నమ్మకం వుంటే ఆ ఉద్యోగం చేస్తాడా? ఆయనకు తెలీనివిషయం నేను చెప్పటంలో తప్పేం? ఆ వెధవ ఉద్యోగం చెయ్యటమేకాక ఆయన దాన్ని వెనకేసుకుని కూడా రావాలా?"

"ఆయనేమీ వెనకేసుకురాలేదు."

"నన్నాపని చెయ్యమంటూంటేనే?"

"ఇంతలో మీ సొమ్మేంపోయింది. చెయ్యనని చెబితే సరిపోలా."

"ఎట్లా సరిపోతుందీ? ఎందుకు చెయ్యనని అడగడూ?"

"నాకిష్టంలేదంటే సరి!"

"ఎందు కిష్టం లేదంటే?"

"ఆయనేమీ అనడు."

"నాలో నిజంగా ఆసక్తి కలవాడైతే తప్పక అడుగుతాడు. అప్పుడీ సమాధానాలు చెప్పాలిసొస్తుంది."

"మీ మనస్సులో ఉండేదంతా తడివి తెలుసుకునేటందు కాయనకేం పట్టింది?"

"ఆయనకు పట్టబట్టే నా ఉద్యోగం సంగతి మాట్లాడానుకున్నాను. నన్ను ఉద్ధరించిన కీర్తికోసం మాట్లాడనుకోలేదు. అట్లా వచ్చినవాడైతే నేనన్నదాన్లో తప్పేమీ లేదులే!"

"మీరు చేసినపని రైటని రుజువు చేయటానికి ఎంతవాదనైనా చేస్తారు."

"ఏ వాదనా చెయ్యకుండా నువు చెప్పింది రైటంటే నీకెక్కువ తృప్తి కలుగుతుంది కాదూ? నే నెన్నడూ నావల్ల తప్పు జరిగిందని ఒప్పుకోలేదు కాదూ?"

వాడిభార్య వాడితో ఇటువంటి వాదనలు చేసినప్పుడు, వాదనలో ఓడనన్న నమ్మకంతో కాక, కేవలం ప్రాణం విసిగి మాట్లాడటం మానేసిందీ. ఇప్పుడుకూడా అట్లాగే మానేసింది.

మార్కండేయులుకు భార్యమీద ఎంత ప్రేమ ఉన్నదో చెప్పటం సాధ్యం కాదు. వాడు ప్రేమించలేనివాడు మాత్రంకాడు. కాని వాడిభార్య వాణ్ణి ఎంతవరకు ప్రేమించిందన్నది సందేహాస్పదమే. ప్రేమించేవాణ్ణి లోకం ప్రేమిస్తుందని ఇంగ్లీషు సామెత ఒకటి ఉంది. కాని కంటికి కనిపించని వాటిని ప్రేమించేవాళ్ళను మామూలు మనుషులు సులభంగా ప్రేమించలేరు. కళలనూ వీరి నియమాలనూ ప్రేమించే వాళ్లను సామాన్యంగా ఎవరూ ప్రేమించలేరు. మార్కండేయులును వాడిభార్య ప్రేమించలేకపోయినట్టయితే అందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. తనను ఆమె సరిగా అర్థంచేసుకునేదన్న విశ్వాసంకూడా మార్కండేయులుకు ఉండేదికాదు. వాళ్ళిద్దరికీ పిల్లలు కలక్కపోవటంతో ఈ ఎడం మరింత అయిందేమో కూడానూ.

యుద్ధంసాగిన అయిదేళ్ళ చిల్లరకాలమూ[1] మార్కండేయులుకు ఒక విధంగా సాగిపోయింది. ఈ కాలంలో మార్కండేయులు అత్తవారిస్థితి బాగా పెరిగింది. మార్కండేయులు బావమరుదులిద్దరూ తమపింతండ్రి మొదలైనవారి సహాయంతో రెండుచేతులా కుప్పలుతెప్పలుగా ఆర్జించారు.

యుద్ధంముగిసిన ఆరునెల్లకల్లా మార్కండేయులు యథాస్థితికి వచ్చేశాడు. ఉద్యోగంలేదు. ఆరేళ్ళు కష్టించి వాడు మిగిల్చినదల్లా నూరు రూపాయలు. ఇది కూడా చూస్తుండగానే కర్పూరం హరించినట్లు హరించిపోయింది.

మార్కండేయులు పెద్దబావమరిది ఒక రోజువచ్చి మార్కండేయులు భావి కార్యక్రమం గురించి మాట్లాడాడు.

"నీకి ఉద్యోగాలవేట దేనికి, మావూరు వచ్చేసి మా వ్యాపారంలో తోడు పడు. నీకేలోటూ ఉండదు. నాలుగు మంచిముక్కలు చెవిని వెయ్యటానికి స్వాములవారున్నారు. ఎటువంటివాళ్ల ఇళ్లకూ పోని ఆయన మన ఇంటికి పదిరోజులకొకసారవ్వా వస్తూ ఉంటారు." అన్నాడు.

ఈ స్వాములవార్ని మార్కండేయులు చూడలేదుగాని ఆయన్ను గురించి కొంత విని ఉన్నాడు. కొన్నేళ్ళ కిందట ఈయనే ఒక గ్రామంలో కృష్ణాష్టమినాడు కృష్ణావతారం ధరించి రాసక్రీడలు చేశాడు. భక్తులంతా పారవశ్యంతో భజన చేస్తుండగా ఈ అవతారపురుషుడు చుట్టూ పరివేష్టించి ఉన్న ఆడవాళ్లను బట్టలు విప్పదీసేసి తనకు సాష్టాంగపడమన్నాడు. ఆయనను మెల్లిగా ఆవూరి వారు సాగనంపారు. స్వాములవారు కావటంచేత దేహశుద్ధి తప్పింది.

"నాకు దొంగవ్యాపారం మీదా, దొంగస్వాములార్లమీదా నమ్మకంలేదు. నా బతుకు నన్ను బతకనీ!" అన్నాడు మార్కండేయులు. వాడు పెళ్ళాంకేసి చూడలేదు. ఆమె మొహాన ఏభావం ఉంటుందో వాడి కీపాటికి బాగా తెలుసు.

"నువ్వు చాలా ధర్మపరుడివని నాకు తెలుసులే. అయినా నీ బతుకు నువ్వు

1. రెండవ ప్రపంచ యుద్ధకాలం 1939-1945

కక్కడివే బతకటంలేదు. మా చెల్లెలుకూడా బతుకుతున్నది. ఆ సంగతి నీకు తట్టినట్టు లేదు.'' అన్నాడు బావమరిది.

"ఈ దౌర్భాగ్యపు దేశంలో ప్రతి ఆడదీ మొగుడి బతుకులో భాగంపంచు కోవలసిందే గాని గత్యంతరంలేదు.''

"అది ఆసరాచూసుకుని నీ భార్యపట్ల నీ ధర్మం నెరవేర్చకుండా కూచుంటావా!''

"దొంగవ్యాపారం చెయ్యడమేనా నువు ధర్మమనేది?''

''దొంగ వ్యాపారమన్న మాటను నువు ఉపయోగిస్తున్నదేగా—''

''నువయితే దాన్ని ఏమంటావ్?''

"నేనయితే, మా యింటో కూర్చుని హాయిగా ఇంత తినగలమనిషి, నీ ఇంట పస్తులెందుకు పడాలంటాను? నీ మూర్ఖత్వంవల్లనే గదా దానికీగతి అంటాను!"

"నీ చెల్లెలు తిండి తిన్నగా తినకుండా ఉండగలందులకే నేను దారిద్ర్యం అనుభవిస్తున్నాననా నీ ఉద్దేశం? ఏనాడు నాతో కష్టాలు పడలేకపోతే ఆనాడు మీ చెల్లెలు మీ ఇంటికి వెళ్ళిపోవచ్చు. దానికి నేను తిండీ,గుడ్డా లోపంచేశానేమోగాని మనిషి కుండదగిన మానవ హక్కులు లోపం చెయ్యలేదు." అన్నాడు మార్కండేయులు.

"దానికి సమయం వస్తుందేమోలే" అన్నాడు బావమరిది.

* * *

గాంధీజీ హత్య జరిగిన వారంరోజులు కాకపూర్వమే[1] మార్కండేయులునూ, వాడి భార్యనూ, బావమరుదులు తమ యింటికి తీసుకుపోయినారు. అప్పటికి పది హేనురోజుల క్రితమే మార్కండేయులు మరొక ఉద్యోగం పోగొట్టుకుని ఉన్నాడు. అందుచేత అత్తవారింటికి వెళ్ళటానికి ఆటే పేచీ పెట్టలేదు.

స్వాములవారుకూడా వచ్చి మార్కండేయులు అత్తవారింట బసచేసి ఉన్నాడు. ఆయన కోసం వచ్చేభక్తులూనూ. పొయ్యే భక్తులూనూ. అందులో అనేకమంది గొప్ప ఉద్యోగాలు చేసేవారూ, చదువుకున్నవారూ, ధనికులూనూ. స్వాములవారిని చూస్తూనే మార్కండేయులకు ఏవగింపు కలిగింది. దానికితోడు ఆయనచేసే సంభా షణ వాడు అసలే సహించలేకపోయినాడు.

స్వాములవారు ఎంతసేపు మాట్లాడినా రెండు మూడు విషయాలను గురించే మాట్లాడేవాడు. అందులో ఒకటి తాను తలుచుకుంటే ఎవరినన్నా భస్మీపటలం చెయ్య గలనని. గాంధీజీ హత్య నిర్ణయించింది తానేనని ఆయన బాహాటంగా ప్రభుత్వాధి కారుల ఎదటా, ఉద్యోగస్తుల ఢంకామీద దెబ్బకొట్టి చెప్పాడు. ఆయన చెప్పే మరొక విషయం ఏమంటే తాను చేసిన బంగారం గురించి, గుట్టలకు గుట్టలు రాళ్ళు బంగారం చేసిపెట్టాట్ట. అది తనకు అవసరం లేదుట, కావలసినవాళ్ళు

1. గాంధీజీ హత్య జరిగింది 1948 జనవరి 30వ తేదీన. అంతకుముందు వారంరోజులు అంటే జనవరి 24వ తేదీ.

తెచ్చుకోవచ్చుట. "ఆ బంగారమంతా అట్లానే పడివుంది," అంటాడు గాని అది ఎక్కడ పడి ఉన్నదీ ఆయన చెప్పనూలేదు. ఎవరూ అడగనూలేదు.

స్వాములవారికి అన్నిటికన్న ప్రియతమమైన విషయం ఆడవాళ్ళను గురించి మాట్లాడటం. వాళ్లు పిల్లల్ని కనటం గురించీ, పిల్లలకు పాలివ్వటం గురించీ, వాళ్ళు పుట్టుకావటం గురించీ ఎంత మాట్లాడినా ఆయనకు విసుగులేనట్టు కనబడింది.

ఆయన భక్తులకు ఉద్యోగాలిప్పిస్తాడు. డబ్బు రప్పిస్తాడు. తనమీద గురి ఉంచడానికి వాళ్ళకు చెప్పరాని బాధలు కల్పిస్తాడు.

ఆయన ప్రసంగం వింటుంటే మొట్టమొదట మార్కండేయులుకు కలిగిన సందేహమేమంటే వినేవాళ్ళంతా వెర్రివాజలని ఆయన అనుకుంటున్నాడేమోనని. ఒక గంటకల్లా ఈ సందేహం పోయింది. వాళ్లు వెర్రివాజలే. ఆయననోట ఏం వచ్చినా స్వీకరిస్తారు. నమ్ముతారు.

"మనుషులిట్లా ఎందుకవుతారు? వాళ్ళ ఆలోచనాశక్తి ఏమవుతుంది?" అనుకున్నాడు మార్కండేయులు. ఆ ప్రశ్నకు సమాధానం తెలిసివచ్చింది. ఈ స్వాములవారి దగ్గిరికి వచ్చేవారు జిజ్ఞాసువులుగా రావటంలేదు. వాళ్లు తమ మేధస్సుకు స్వస్తి చెప్పి డబ్బుకోసం, క్షేమంకోసం, ఇహ సుఖాల గ్యారంటీకోసం వస్తున్నారు. వీళ్ళవి ఆయన ఎదట బానిస బుద్ధులు. అవి ప్రశ్నించలేవు, విమర్శించలేవు, తిరగబడలేవు. సమాజం విచ్ఛిన్నమవుతున్నదనీ, మనుషుల సాముదాయిక భావాలు పటాపంచలై వ్యక్తి స్వార్థమే మిగిలి ఉందనీ ఈ స్వాములవారు కనిపెట్టాడు. ఏ రాజకీయవాదికీ అర్థంగాని జీవితసత్యం ఈ సన్యాసివాడికి అర్థమయింది. వీళ్ళను తన ఇనపపిడికిట్లో చిక్కించుకున్నాడు.

"నేను ఇంటికి వెళ్ళిపోతున్నాను. వస్తావా?" అన్నాడు మార్కండేయులు పెళ్ళాంతో.

"పొద్దునేగా వచ్చింది? అప్పుడేనా పోవటం!" అన్నదామె.

"రాత్రిబండికి పోదాం. నువు రాకపోతే నేను ఒక్కణ్ణే పోతాను."

"మా అన్నయ్యలతో చెప్పండి."

మార్కండేయులు చెప్పాడు. చెప్పటమే కాదు, స్వాములవార్ని గురించి తానేమనుకుంటున్నదీకూడా చెప్పాడు. వాళ్ళు మారు మాట్లాడలేదు.

"నువు స్వామివారి అనుజ్ఞతీసుకుని వెళ్లటం మంచిది. ఆయన అనుజ్ఞ లేకుండా బయలుదేరినవాళ్లు చాలా కష్టాలపాలవుతారు." అన్నాడు పెద్ద బావమరిది.

"ఈ చాదస్తమంతా నువుకూడా నమ్ముతున్నావా?"

"నువుకూడా అంటే? నేనాయన అమానుషశక్తులు కళ్లారా చూసినవాణ్ణి."

"నేనాయన్ను అడగను. నాకాయన గార్డియనుకాదు." అన్నాడు మార్కండేయులు.

"త్రిమూర్తులకుకూడా ఆయనే గార్డియను. నువ్వు అడక్కపోతే నేనే అడుగుతాను."

"మీ చెల్లెలు వెళ్లటానికి మా ఆజ్ఞలేదు. ప్రాణంలేని తోలుబొమ్మలు నిష్క్రమించవచ్చు. అగచాట్లపాలు కావచ్చు," అన్నాడు స్వాములవారు, మార్కండేయులు బావమరిది ప్రశ్నించగా.

"స్వాములవారు ఒప్పుకోలేదు. నేను పోతున్నాను, వస్తావా" అన్నాడు మార్కండేయులు భార్యతో.

"అమ్మో, నేనురాను." అన్నదామె.

ఆ రాత్రి బండికని మార్కండేయులు బయలుదేరాడు. స్టేషనుకువెళ్ళే దారిలో వాడి పక్కగా ఒకటి రెండు రాళ్లు పడినై. స్వాములవారికి రాళ్ళుపడేయించే మహత్తుండికూడా, ఆ రాళ్ళు తగిలేటట్టువేసే గురిలేకపోవటానికి వాడు నవ్వుకుని రైలెక్కాడు.

*

మార్కండేయులు భార్య ఆనాటినుంచీ పుట్టింటోనే ఉన్నది. వాడి భార్య ఏడాదికింపట ఒక పిల్లను కన్నది. అంతకుపూర్వం తొమ్మిది మాసాలక్రితం మార్కండేయులు డబ్బుకోసం రహస్యంగా వచ్చి రెండు రోజులుండి డబ్బు పట్టుకుపోయినట్టూ స్వాములవారే డబ్బు ఇచ్చినట్టూ వాడి అత్తవారు చెబుతారు. స్వాముల వారు వాడి పెళ్లానికి చాలా నగలు చేయించిపెట్టారు.

తన భార్య ప్రసవించిందని తెలిసిన రోజే మార్కండేయులు మా ఇంటికి వచ్చాడు. రాత్రి మాయింటనే పడుకున్నాడు. తన విషయాలన్నీ పూసగుచ్చినట్టు చెప్పాడు. నన్ను కొంత డబ్బు అడిగి తీసుకున్నాడు. మర్నాడు ఫలానిచోటికని చెప్పకుండా బయలుదేరిపోయినాడు. వాడిప్పుడెక్కడ ఉన్నదీ ఎవరికీ తెలీదు. నాకైనా ఒక కార్డుముక్క రాయలేదు. ఇక వాణ్ణి గురించి నాకేమీ ఆశలేదు. వాడి అధ్యాయం ముగిసినట్లే భావిస్తాను. "ఈ జీవితం ఇట్లా ఎందుకయినట్టు" అని వాడన్న మాటమాత్రం నేను బతికున్నన్నాళ్ళూ నా చెవుల్లో మారుమోగుతూనే ఉంట్టుంది. ఆ మాట అన్నప్పుడు వాడు తన విషయమే ఆలోచిస్తున్నాడని నాకు తోచలేదు.

— ముద్రణ : ఆంధ్రజ్యోతి మాసపత్రిక,
మే 1950